


# కరపత్రం

SINCE 2014

గురువారం అక్టోబర్ 10 2024 | సంపుటి :0 | సంచిక : 3 | పేజీలు:4 | వెల-5


## 'ప్రైవేటు'లో మీకంటే గొప్పవారు ఉన్నారా?:

# డీఎస్సీ విజేతలతో సీఎం రేవంత్



డీఎస్సీ విజేతలను చూస్తే దసరా ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

పేజీ 2లో

## సిఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి

### మనవరాలి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానం



తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డితో మాజీమంత్రి మల్లారెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి వచ్చి. తన మనమరాలి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానించారు. పెళ్లి పత్రిక ఇచ్చేందుకు రేవంత్ ఇంటికి వచ్చానని స్పష్టం చేశారు. అంతే తప్ప ఇతర కారణం ఏదీ లేదని తేల్చి చెప్పారు. గతంలో వీరిద్దరూ తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేశారు. ముందుగా మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరగా తర్వాత రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఆ సమయంలో భూ ఆక్రమణల గురించి ఇద్దరి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఆ తర్వాత పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. రేవంత్ రెడ్డి సీఎం పదవి చేపట్టారు. దాంతో మల్లారెడ్డి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఒకానొక సమయంలో మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నించారని వార్తలు గుప్పుమన్నాయి. కాంగ్రెస్ పార్టీలో మల్లారెడ్డి చేరికను రేవంత్ రెడ్డి అడ్డుకున్నారని మల్లారెడ్డి అనుచరులు ఆరోపించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## మీ రాజకీయ పునరాగమనం

# అభినందనీయం

కాశ్మీర్ సిఎంగా మళ్లీ కాబోతున్నందుకు అభినందనలు
ఎక్స్ వేదికగా ఒమర్ అబ్దుల్లాను ప్రశంసించిన కెటిఆర్
యువతకు మోసం చేశారంటూ రాహుల్‌పై విమర్శలు



కాశ్మీర్ ఎన్నికల్లో విజయం సాధించిన ఓమర్ అబ్దుల్లాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. అద్భుతమైన పునరాగమనం చేశారంటూ.. కితాబు ఇచ్చారు. 'వారు చెప్పినట్లు, మీరు మీ పునరాగమనం ఎదురుదెబ్బ కంటే మెరుగ్గా ఉండేలా చూసుకున్నారు..భారతదేశంలోని అత్యంత అందమైన రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నం దుకు శుభాకాంక్షలు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. రాహుల్ జీ, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేసినందుకు ధన్యవాదములు.. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అందించినందుకు ధన్యవాదాలు చెప్పటానికి అశోక్ నగర్ యువత వేచి ఉన్నారు.. 5 లక్షల యువ వికాసం సహాయం, పునరుద్ధరణకు కూడా ధన్యవాదాలు.. మీ హామీ పూర్తయినందున యువకులను కలవడానికి తిరిగి హైదరాబాద్‌కు రావడానికి స్వాగతం అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. కర్ణాటకలో ఐదు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలంటూ అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్..

పేజి 2లో

### మూసీ నిధుల్లో రూ.లక్ష కోట్లు కాజేయాలని కాంగ్రెస్ కుట్ర

:తెలంగాణలో దసరా పండుగ జరుపుకునే వీలులేకుండా భయానక వాతవరణం సృష్టించారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.

2లో

### రాహుల్‌గాంధీకి హైదరాబాద్ యువకులు స్వాగతం పలుకుతున్నారు: కేటీఆర్ ఎద్దేవా

2లో

అశోక్ నగర్‌లోని యువత ఒక సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపేందుకు ఎదురుచూస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## మా తొలి ప్రాధాన్యం కాశ్మీర్‌కు రాష్ట్ర హోదానే

### అధికారం చేపట్టగానే దీనిపైనే తీర్మానిస్తాం
### కాబోయే సిఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటన



2లో

## ఎస్సీ వర్గీకరణ చేయకుండా డిఎస్సీ నియామకాలు

ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆందోళన ఇందిరాపార్క్ వద్ద మందకృష్ణను అడ్డుకున్న పోలీసులు



2లో

## మెట్రో రెండోదశ అంచనా వ్యయం రూ.24,269 కోట్లు

ఫోర్త్‌సిటీ మినహా ఐదు మార్గాలకు వేర్వేరుగా డీపీఆర్‌లు
క్యాబినెట్ ఆమోదించాక కేంద్రానికి..



రాజధాని మెట్రోరైలు రెండోదశలో ఐదు మార్గాల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. 76.2 కి.మీ.కు రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్‌లో అధికారులు పేర్కొన్నారు. ఫోర్త్‌సిటీ మినహా మిగిలిన ఐదు కారిడార్లకు వేర్వేరుగా నివేదికలు ఇచ్చారు. దసరా నాటికి డీపీఆర్‌లు సమర్పించాలని ప్రభుత్వం తొలుత నిర్దేశించింది. ఈ నెల 7న (సోమవారం) దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో సీఎం భేటీ ఖరారు కావడంతో..

పేజి 2లో

## ప్రతిపక్షం ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా..

# డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు: భట్టి

కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు.

కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు.



దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. ప్రతిపక్షం డీఎస్సీపై ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఆటంకాలు సృష్టించినా అనుకున్న సమయానికి డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. "ఏళ్ల తరబడి పదోన్నతులు, బదిలీల్లేక టీచర్లు ఇబ్బందులు పడ్డారు.

పేజి 2లో

# ‘ప్రైవేటు’లో మీకంటే గొప్పవారు ఉన్నారా?: డీఎస్సీ విజేతలతో సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు.

నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. “తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?” అని ప్రశ్నించారు.

**ఎందుకలా జరుగుతోందో ఆలోచించండి..**

“ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం.

**65 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేశాం..**

“ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం.

**పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కవితకు ఎమ్మెల్సీ పదవి..**

రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్ఎస్‌కు ఎందుకంత కోపం?

## ప్రతిపక్షం ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా..

# డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు: భట్టి

మొదటిపేజీ తరువాయి

మా ప్రభుత్వం రాగానే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసింది. డీఎస్సీపై ప్రతిపక్షం చాలా కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు” అన్నారు.మరోవైపు, రాష్ట్రంలో 10వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేవలం ఏడు నెలల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియను రేవంత్ సర్కార్ పూర్తి చేసింది. డీఎస్సీ పరీక్షలకు 2.46లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోకుండా మొత్తం ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. మొత్తం 2,515 స్కూల్ అసిస్టెంట్లు, 685 భాషా పండితులు, 6277 ఎస్‌జీటీ, 145 పీఈటీ, 103 స్పెషల్ ఎడ్యుకేటర్ల పోస్టులు, 281 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేశారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 761మంది, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా నుంచి 82మందినియామక పత్రాలు అందుకోనున్నారు. కోర్టు కేసులు, ఇతర సమస్యలతో 1056 పోస్టుల భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది.

# మెట్రో రెండోదశ అంచనా వ్యయం రూ.24,269 కోట్లు

మొదటిపేజీ తరువాయి

ఆ పర్యటనకు ముందుగానే డీపీఆర్‌లు కావాలని సీఎం కార్యాలయం కోరింది. దీంతో ఏడో తేదీ నాటికి డీపీఆర్‌లను ప్రభుత్వానికి సమర్పించామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) అధికారులు తెలిపారు. నివేదికలు గతంలోనే సిద్ధమైనా కీలకమైన ట్రాఫిక్ అధ్యయన నివేదిక ‘కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)’ కోసం ఆగారు. సీఎంపీ ముసాయిదా సిద్ధం కావడంతో ఆ నివేదికను డీపీఆర్‌కు జోడించి సర్కారుకు అందజేశారు. దీని ఆధారంగానే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీపీఆర్‌లు పంపనున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్రం సైతం సానుకూలంగా ఉన్నట్లు మెట్రో వర్గాలు తెలిపాయి.

**18 శాతం కేంద్రం నిధులతో..**

మెట్రోరైలు ప్రాజెక్టులను వేర్వేరు నగరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యాలతో నిర్మిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం భరించే వాటా సాధారణంగా 15 శాతం ఉంటుంది. హైదరాబాద్ మెట్రో రెండోదశలో 18 శాతం వరకు ప్రతిపాదిస్తున్నారు. రాష్ట్రం తన వాటాగా 30 శాతం భరించేందుకు సిద్ధపడుతుంది. 4 శాతం పీపీపీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలనేది ఆలోచన. మిగిలిన 48 శాతానికి సంబంధించి జైకా వంటి సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుంటారు. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్య ప్రాజెక్టుపై రుణాలకు కేంద్రం పూచీకత్తు ఇస్తుందని అధికారులు అంటున్నారు.

మెట్రో రెండోదశ డీపీఆర్‌ను తొలుత రాష్ట్ర మంత్రి మండలిలో చర్చించి ఆమోదించాలి. తదుపరి క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపిస్తారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసి మెట్రో రెండోదశకు ఆమోదం తెలపాలని కోరే అవకాశం ఉంది.

# మా తొలి ప్రాధాన్యం కాశ్మీర్‌కు రాష్ట్ర హోదానే

మొదటిపేజీ తరువాయి



జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గెలుపు అనంతరం సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపడతారని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రధానికి సమర్పిస్తామన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికలు, రాష్ట్ర హోదా వరుసగా ఉంటాయన్నారు. కొందరు నేతలు జమ్మూకశ్మీర్‌ను దిల్లీతో పోల్చడంపై ఆయన మండిపడ్డారు. కశ్మీర్‌ను దిల్లీతో పోల్చవద్దని..ఎందుకంటే దేశ రాజధానికి రాష్ట్ర హోదా ఇస్తామని ఎవరూ చెప్పలేదన్నారు. కానీ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని, హోంమంత్రి, భాజపా సీనియర్ మంత్రులు చెప్పారని పేర్కొన్నారు. 2019 వరకు జమ్మూకశ్మీర్ రాష్ట్రంగానే ఉందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పడం, అభివృద్ధికి బాటలు వేయడం కోసం రాష్ట్ర హోదా తప్పనిసరి అని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉన్న రాజకీయ పార్టీలను భాజపా లక్ష్యంగా చేసుకొని.. బలహీనపరచడానికి ప్రయత్నించిందని దుయ్యబట్టారు. కానీ ఆ పార్టీ ఎత్తులు ఫలించలేదన్నారు. ముఖ్యమంత్రిగా తన పేరును తన తండ్రి ప్రకటించడంపై ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం మిత్రపక్షాలతో చర్చలు జరిపి ఈవిషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో 2019లో ప్రత్యేక ప్రతిపత్తి హోదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిపోయింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలన్నది ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంతవరకూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో అడుగుపెట్టబోనని అన్న ఒమర్.. యూటర్న్ తీసుకొని, అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకు తన ప్రయత్నాన్ని విరమించుకోనని

# ఎస్సీ వర్గీకరణ చేయకుండా డీఎస్సీ నియామకాలు

మొదటిపేజీ తరువాయి

డిఎస్సీలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఆందోళన చేపట్టింది. ఈ క్రమంలో నగరంలో ఆందోళనకు దిగిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ఈ నిరసనను పోలీసుల అడ్డుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు, పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం తోపులాట ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన మాదిగల నిరసన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన ఆందోళనకారులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి మాదిగలకు డీఎస్సీ ద్వారా వచ్చే ఉద్యోగాలను కల్పించిన తర్వాతే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ముందుగానే నియామక పత్రాలు అందజేయడం వల్ల మాదిగలు అన్యాయానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను, కార్యకర్తలు ఉద్యమ కారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదా అని ప్రశ్నించారు. అలాగే ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల భర్తీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చి.. మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గడానికి కారణం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణను తొలుత దేశంలో అమలు చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అర్ధ గంటకే రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలకు కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని తెలిపారు. అయితే రెండు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి మాదిగలకు వెన్నుపోటు పొడిచారని మందకృష్ణ విరుచుకుపడ్డారు.

# ఆర్థిక వనరులు లేకున్నా రుణమాఫీ

**రాజకీయాల్లో భాష సక్రమంగా ఉండాలి**

**మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాల్సిందే**

**మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు**



ఆర్థిక వనరులు ఉన్నా లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాగా పని చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రుణమాఫీ చేశారని.. రైతు భరోసా కూడా ఇస్తామని ప్రభుత్వం చెప్తోందని.. తొందరగా ఇస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకులు పరుష పదజాలం వాడడం బాధాకరమన్నారు. కొందరు ఇష్టమున్నట్టు మాట్లాడితే తనలాంటి వాడికి ఇబ్బందిగా ఉందన్నారు. సోషల్ మీడియాలో వాడే పదజాలం పద్ధతిగా ఉండాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడకపోవడం ఆయన ఆటిట్యూడ్ అని.. మాట్లాడడం మాట్లాడకపోవడం కేసీఆర్ ఇష్టమని చెప్పుకొచ్చారు. హైడ్రా విషయంలో ప్లస్సా , మైనస్సా అని లెక్కలు వేయొద్దన్నారు. చంద్రబాబు రోడ్లు విస్తరణ వేసేప్పుడు తిట్టారని... రోడ్డు అయ్యాక మెచ్చుకున్నారని గుర్తుచేశారు. మురికిలో బతుకుతున్న వాళ్ళకి మంచి నివాసాలు ఇవ్వడం మంచిదే కదా అని అన్నారు. చెరువుల దగ్గరికి వెళ్లి ఎన్ని ఇండ్లు అక్రమంగా కట్టారో చూడాలన్నారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరైంది కాదని.. పది నెలల నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉందని చెప్పుకొచ్చారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ప్రతిపక్షం బాధ్యతగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కొన్ని విమర్శలు చూస్తే వ్యక్తిగత కక్షతో చేసినట్టు కనిపిస్తోందన్నారు. 88 మంది వచ్చిన వాళ్ళు కూడా పూర్తి కేబినెట్ ఎందుకు వేయలేదని కేసీఆర్‌ను అడగాలన్నారు. సంవత్సరాలు నడిచిన కమిషన్లు, ఎంక్వయిరీ కమిటీలు ఉన్నాయని... మూడు నెలలకే కమిటీ ఏమైంది అనడం హాస్యాస్పదమంటూ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు ఇంత కాస్ట్లీ కావడానికి అన్ని పార్టీలు కారణమన్నారు. ‘నువ్వు సుద్ద పూసవైతే ఎదుటివాడ్ని విమర్శించు. టీఆర్ఎస్ పార్టీకి ఖాతా తెరవడానికి డబ్బులు లేకుండే. ఇప్పుడు 1500 కోట్లు ఉన్నాయని వారే ప్రకటించారు. రాజకీయ నాయకుల లూప్ హోల్స్ అధికారులకు తెలుసు. అధికారులు పర్మినెంట్, నేతలు టెంపరరీ‘ అంటూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ కామెంట్స్ చేశారు. మరోవైపు శాసనమండలి చీఫ్ విప్‌గా పట్నం మహేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ విప్‌పై మండలి చైర్మన్ పలు వ్యాఖ్యలు చేశారు. మహేందర్ రెడ్డిని బీఆర్ఎస్ విప్‌గా చూడాలా? కాంగ్రెస్ విప్ గా చూడాలా అని మీడియా ప్రశ్నించగా... మహేందర్ రెడ్డిని అఫిషియల్ విప్‌గా చూడాలని మండలి చైర్మన్ తెలిపారు. నేను బీఆర్ఎస్ మండలి చైర్మన్‌ను కాదు.. మండలి చైర్మన్ పదవి తీసుకున్నాక నాకు ఏ పార్టీ ఉండదని గుత్త సుఖేందర్ రెడ్డి వెల్లడించారు.

# మూసీ నిధుల్లో రూ.లక్ష కోట్లు కాజేయాలని కాంగ్రెస్ కుట్ర

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ :తెలంగాణలో దసరా పండుగ జరుపుకునే వీలులేకుండా భయానక వాతవరణం సృష్టించారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత మహ్మద్ అల్లావుద్దీన్, పలువురు నేతలు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవన్న కేటీఆర్... బతుకమ్మ ఆడుకునేందుకు వీలులేకుండా డీజేలు బంద్ చేశారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని ఆక్షేపించారు. రైతులకు పూర్తి రుణమాఫీ కాలేదన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తామన్నారు. 1.7 కోట్ల మంది మహిళల్లో ఒక్కరికి కూడా రూ.2500 రాలేదని అన్నారు.

మూసీ పేరిట రూ.లక్ష కోట్లు కొల్లగొట్టి.. కాంగ్రెస్ కాజేయాలని చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కమీషన్లు రావు కాబట్టే హామీలు అమలు చేయడం లేదన్నారు. హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నేతలను నిలదీయాలన్నారు. హరియాణాలో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని.. ఆ ఫలితాలు చూసైనా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి హామీలు అమలు చేయాలని సూచించారు.

హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ కేసీఆర్ లేని లోటును గుర్తు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కక్షగట్టి తన సోదరి కవితను అరెస్ట్ చేసి తీహాడ్ జైల్లో పెట్టారని... అయినా భయపడకుండా పోరాడుతూనే ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులు, ప్రజలకు అండగా నిలబడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని దుర్మార్గంగా అరెస్ట్ చేశారని, రైతులపై లాఠీ ఛార్జ్ చేశారని కేటీఆర్ మండిపడ్డారు. పట్నం నరేందర్ రెడ్డి, నేతలను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మీ రాజకీయ పునరాగమనం అభినందనీయం

మొదటిపేజీ తరువాయి

హరియాణలో ఏడు గ్యారెంటీలని మభ్యపెట్టే ప్రయత్నాన్ని ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్ర ఎన్నికల్లో ఒక్కో గ్యారెంటీ పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసిన కాంగ్రెస్ బొక్కబోర్లా పడిందని ఎద్దేవా చేశారు. హరియాణలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని, చెప్పేమాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇలాంటి చెంపపెట్టులాంటి ఫలితాలు తప్పవన్నారు. బుల్డోజర్‌రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఆయన చేసిన డ్రామాలకు హరియాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. సోషల్ మీడియా విస్తృతి పెరిగిన ఈ రోజుల్లో రాష్ట్రాలు వేరైనా ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యంకాదన్నారు. కాంగ్రె?సతో హోరాహోరీ ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని, ఆ పార్టీ ఓటమికి రాహుల్‌గాంధీ బలహీన నాయకత్వంకూడా ఓ ప్రధాన కారణమన్నారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉందన్న విషయం ఆయా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను చూస్తే అర్థమైపోతుందని తెలిపారు. మరోవైపు.. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు వేతనాలు రాక విలవిలలాడుతున్నారని, ఈ దండగమారి పాలనలో పండుగపూట వారంతా పస్తులు ఉండాల్సిందేనా? అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారునెలలుగా జీతాల్లేవని, పంచాయతీ వర్కర్లు, మునిసిపాలిటీ కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్లు, గెస్ట్ లెక్చరర్లు.. ఇలా ప్రతీశాఖలో వేతనాల పెండింగ్ ఉందన్నారు. ఆయా ఉద్యోగులు తమ కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులుచేసి తిప్పలు పడుతున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీనే జీతాలిస్తామన్న మీ ప్రగల్భాలు ఏమయ్యాయని నిలదీశారు. ఉద్యోగుల అవస్థను గుర్తించి తక్షణం వేతనాలు చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రాహుల్‌గాంధీకి హైదరాబాద్ యువకులు స్వాగతం పలుకుతున్నారు: కేటీఆర్ ఎద్దేవా



మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: అశోక్ నగర్‌లోని యువత ఒక సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు అందించినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలిపేందుకు ఎదురుచూస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ‘ఎక్స్’లో ఆయన పోస్టు చేశారు. రూ.5 లక్షల యువ వికాసం సహాయం, పునరుద్ధరణకు ధన్యవాదాలు అని పేర్కొన్నారు. మీ హామీ పూర్తయినందున యువకులను కలవడానికి తిరిగి హైదరాబాద్‌కు స్వాగతం అంటూ విమర్శనాత్మకంగా పోస్టు పెట్టారు. గతంలో హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో పర్యటించిన సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదని కేటీఆర్ పేర్కొన్నారు. బీసీ బిడ్డలకు విదేశీ విద్య అందని ద్రాక్షేనా? అని ప్రశ్నిస్తూ కేటీఆర్ ‘ఎక్స్’ వేదికగా మరో పోస్టు చేశారు. “నాడు కేసీఆర్‌తో సాధ్యం.. నేడు అసాధ్యం.. పేద విద్యార్థులతో సర్కార్ చెలగాటం. జ్యోతిబా ఫులే విదేశీ విద్య పథకానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తోంది. అధికారుల సాగతీతతో విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల కోర్సులు ముగుస్తున్నాయి. ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. దరఖాస్తు చేసుకొని ఏడాది అవుతున్నా ఎందుకింత నిర్లక్ష్యం? వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రేవంత్ సర్కార్ అంధకారంలోకి నెట్టింది. తక్షణం జాబితా ప్రకటించి ఉపకార వేతనం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం” అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పి ఆర్ టీ యూ టీ ఎస్ సంఘముల 2వ-సారిగా స్టేట్ మహిళా అసోసియేట్ ప్రెసిడెంటాగాఎన్నికైన జెట్టి రాధ



**కరపత్రం ప్రతినిధి అక్టోబర్ 9**
వీరు 14-10-1987లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టు, పి ఆర్ టీ యూ టీ ఎస్ ఈ మండల మహిళా ఉపాధ్యక్షురాలి నుండి' స్టేట్ మహిళా అసోసియేట్ ప్రెసిడెంట్ నా ఎన్నికైనారు. వీరు సంఘములో 3 సం?లుగా ఉపాధ్యాయ హక్కుల గురించి, ఎన్నో పోరాటాలు, దర్నాలు చేసినందుకు 2వ సారిగా తమకు అవకాశం కల్పుండిన జిల్లా అధ్యక్షులు కర్రు సురేష్ , ప్రధాన కార్య వర్షలు గండు కృష్ణమూర్తిగారులకు మాత్రత్యేక కృతజ్ఞలలు ప్రస్తుతం వీరు ఓదెల మండల్ ఇందుర్తితో ఎం పి యూ పి ఎస్ . హెచ్ ఎం గా విదులు నిర్వర్తిస్తున్నారు.

## జిపి కార్మికులకు బట్టలు అందజేసిన వ్యాపారి..



**కరపత్రం శంకరపట్నం అక్టోబర్ 9**
దసరా పండుగను పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్మికులకు ఓ వ్యాపారి స్వచ్ఛందంగా బట్టలను కొనుగోలు చేసి బుధవారం అందజేశారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, కరీంపేట్ గ్రామానికి చెందిన బూర్ల శ్రీధర్ అనే యువకుడు గత కొన్ని ఏళ్ల నుండి మండల కేంద్రంలోని కేశవపట్నం గ్రామంలో హార్డ్వేర్, వాహనాల స్పేర్ పార్ట్స్ వ్యాపారం కొనసాగిస్తున్నాడు సేవాభావంతో బోర్ల శ్రీధర్ కేశవపట్నం గ్రామపంచాయతీ కార్మికులకు పేరుగాంచిన వస్త్రాలయంలో వస్త్రాలు కొనుగోలు చేసి సిబ్బందికి అందజేశారు. శ్రీధర్ సేవా భావానికి పలువురు అభినందించారు. గ్రామపంచాయతీ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయ పార్టీల సమీక్ష సమావేశం...



- డిప్యూటీ తాసిల్దార్ మల్లేశం...

**కరపత్రం శంకరపట్నం అక్టోబర్ 9**
పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు పై రెవెన్యూ శాఖ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో అఖిలపక్షం సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ మల్లేశం మాట్లాడారు పట్టభద్రుల టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమం అర్హులైన వారు నవంబర్ 6 లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని నమోదు కార్యక్రమం ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు నిర్వహించడం జరుగుతుందని అఖిలపక్షం సమావేశాన్ని నిర్వహించి రాజకీయ పార్టీలకు వివరించినట్లు తెలిపారు. ఓట్ల నమోదు కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించి పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ తాసిల్దార్ మల్లేశం కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిపిఎం వెల్మారెడ్డి రాజిరెడ్డి, టిడిపి సయ్యద్ ఆరీఫ్, యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గం ,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షారుక్, బిజెపి నాయకులు బొజ్జ సాయి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

- సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు

రైతుల సంక్షేమం కోసం అనునిత్యం ప్రభుత్వం పాటుపడుతుందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. బుధవారం పోతంగల్ మండలంలోని హెగ్డోలీ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సోయా పంటకు 4892 రూపాయలు మద్దతు ధర ప్రకటించిందని, రైతులు తాము పండించిన పంటను కోనుగోలు కేంద్రలోనే విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాంతు, సొసైటీ చైర్మన్ శాంతిశ్వర్ పటేల్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్,మాజీ జడ్పీటిసి పుప్పాల శంకర్,మాజీ ఎంపీపీ పవన్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,స్థానిక నాయకులు హమీద్,గంగాధర్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# అక్రమ కేసులు పెట్టిన పోలీస్ అధికారులపై, భూమి అమ్మి, పట్టా చేయని వ్యక్తులపై సీపీకి ఫిర్యాదు..

- తనకు న్యాయం చేయాలని వేడుకున్న భూ బాధితుడు మ్యాక రమేష్..

**కరపత్రం ప్రతినిధి,వీణవంక, అక్టోబర్ 8.**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన మ్యాక రమేష్ రెడ్డిపల్లి శివారులో గల వ్యవసాయ భూమి 7 ఎకరాల 25 గుంటల భూమిని అన్ రెడ్డి ప్రకాశ్ రెడ్డి, అన్ రెడ్డి అరుణ దగ్గర నుండి 2019 జనవరి 11 వ తేదీన భూమిని కొనుగోలు చేసి, కబ్జాలో కొనసాగుతూ, వ్యవసాయం చేస్తున్న తరుణంలో మొదటగా 40 లక్షలు ఇవ్వగా, భూమి తక్కువ ధరకు తీసుకున్నామంటూ, అమ్మ కబుదారులు గతంలో పనిచేసిన వీణవంక ఎస్సై శేఖర్ రెడ్డితో కుమ్మక్కై , కొనుగోలు దారైనా మ్యాక రమేష్ ను భయభ్రాంతుల గురిచేసి, అదనంగా 28 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, మొత్తం 90 లక్ష రూపాయలు చెల్లించడం జరిగిందని,
కానీ, కేవలం 5 ఎకరాల 32 గుంటలు మాత్రమే పట్టా చేయడం జరిగిందని, పూర్తి డబ్బులు ముట్టినా




తర్వాత అప్పటి కరీంనగర్ సి.పి సత్యనారాయణ, గతంలో పనిచేసిన జమ్మికుంట రూరల్ సీఐ సీఐ సురేష్ కుమార్, గతంలో పనిచేసిన వీణవంక ఎస్సై శేఖర్ రెడ్డిలు, అమ్మకపు దారులతో కుమ్మక్కై,ప్లాన్ ప్రకారం మూడు ఎకరాల పత్తిని ధ్వంసం చేయించి , రెండు మోటార్లను బావిలో వేసి, ఫీజులను తీసేసి, నారుమడికి గడ్డి మందు కొట్టించడం జరిగిందని, నాపై తప్పుడు కేసులు బనాయించి, వారిపై నామా మాత్రంగా కేసులు చేసి, నన్ను ఆర్థికంగా మానసికంగా వేధించడమే కాకుండా, మిగతా భూమి 1 -27 గుంటల భూమిని పట్టా చేయకుండా, పట్టా చేయమని అడుగుతే నన్నే చంపుతామని బెదిరించడం జరుగుతుందని, బాధితుడు మ్యాక రమేష్ మంగళవారం కరీంనగర్ సిపి అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేశానని, సిపి సూచన మేరకు హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి ని కలవడం జరిగిందని, నాపై తప్పుడు అక్రమ కేసులు బనాయించిన అధికారులపై పోలీసు అధికారులపై విచారణ జరిపి, చట్టరీత్య చర్యలు తీసుకొని, భూమి కొనుగోలు జరిపిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి, నాకు, నా కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు.

# వీణవంక లో పండుగ పూట.. మారని రోడ్ల దుస్థితి.. కంకర పోసి.. నరకాన్ని చూపిస్తున్న వైనం...

- రోడ్లను పట్టించుకునే పాలకుడే లేడా..?
- దయనీయమైన పరిస్థితుల్లో వాహనదారులు..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 8.**
వీణవంక మండల కేంద్రంలో సంవత్సరాలుగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు, రోజురోజుకు మరి అధ్వానంగా నత్త నడకన సాగుతున్నాయి. మొన్నటి వరకు బ్రిడ్జి లేక ఇబ్బందులు పాలై, ప్రయాణికులు నరకయాతనా పడ్డారు. కానీ, నూతనంగా నిర్మించిన బ్రిడ్జ్ నుండి టవర్ వరకు కంకర వేసి వదిలేయడంతో, వాహనదారులు మార్గం వెంట వెళ్లాలంటే జంకుతున్నారు. ఒకవైపు కంకర కుప్పలు, ఒకవైపు కంకర రాళ్లు, కొద్దిగా స్పీడ్ పెంచితే, క్రింద పడతామని భయంతో నెమ్మదిగా వెళుతుంటే, అకస్మాత్తుగా ఎదురుగా బస్సు, లారీ కనుక వచ్చిందంటే, ఒక్కసారిగా దుమ్ము ఆవరించి రెండు నిమిషాలు పక్కన ఉన్న వాహనం కనబడదు, అదికాక దుమ్ము కంట్లో పడి, శరీరాన్ని ఒక్కసారిగా దుమ్ము ధూళి ఆవరించి రోగాల పాలు చేస్తుందని, రోడ్డు కాంట్రాక్టు నిర్లక్ష్యంతో కనీసం వేసిన కంకరను ప్రతిరోజు వాటర్ కొట్టకుండా, రోడ్డు రోలల్ తో తొక్కించకుండా, ఉండడం వల్లే ఇబ్బందుల పాలవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. నర్సింగాపూర్ గ్రామంలో మాత్రం ఉదయం, సాయంత్రం వేళలలో వాటర్ కొట్టడం జరుగుతుందని,కానీ, వీణవంక వైపు ఎందుకు కొట్టడం లేదని కాంట్రాక్టర్ పై వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు,ప్రజా ప్రతినిధులు వెంటనే మేల్కొని చర్యలు తీసుకుని, రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరపాలని, సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను, సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని,కనీసం తాత్కాలికంగా రోడ్డుపై, ఉదయం, సాయంత్రం వాటర్ కొడుతూ, రోడ్డు రోలర్ తొక్కించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.





# ఆయిల్ ట్యాంకర్ బోల్తా రిస్కు చేసి డ్రైవర్ను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

**కరపత్రం ప్రతినిధి జగిత్యాల అక్టోబర్ 9**

జగిత్యాల జిల్లా మాల్యల్ మండలం కొండగట్టు వద్ద ఘటన ఆయిల్ వ్యాన్ బోల్తా రిస్క్ చేసి డ్రైవర్ ను రక్షణ అగ్నిమాపక సిబ్బంది జగిత్యాల కరీంనగర్ హైవే రోడ్డు కొండగట్టువద్ద ఘటన చోటు చేసుకుంది కామారెడ్డి నుంచి మంచిర్యాల ఆయిల్ లోడ్ తో వెళు న్న డీసీఎం వ్యాన్ కారును తప్పించబోయి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది క్యాబిన్లో డ్రైవర్ ఇరుకపోవడం తో వెంటనే సమాచారం అందుకున్న జగిత్యాల అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గంటన్నర పాటు రెస్క్యూ చేసి డ్రైవర్ను



సురక్షితంగా బయటకు తీశారు డ్రైవర్ కామారెడ్డి చెందిన నర్సయ్య డ్రైవర్ తెలిపాడు.తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం డ్రైవర్ ను 108వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారూ జగిత్యాల అగ్ని మాపక అధికారి మాట్లాడుతూ



సుమారు గంటన్నర రిస్క్ చేసి గ్యాస్ కట్టర్ టి వ్యాన్ డోర్ ను తొలగించి డ్రైవర్ ప్రాణాలను కాపాడిన ఫైర్ సిబ్బంది ఏ కృష్ణ కాంత్ , ఎల్ ఎఫ్ జి మధు, ఆపరేటర్ ఏ మల్లేశం, ఫైర్ మాన్లు ఏం వేణు, ఎం రాజేందర్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు...

## ట్యాంక్ బండ్ పై అత్యంత వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు.

**కరపత్రందినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి.**

హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై సుమారు పదివేల మంది మహిళలతో 10అక్టోబర్ గురువారం సాయంత్రం సద్దుల బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగానిర్వహించునున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిశాంతి కుమార్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యం లో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. రేపు నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సి ఎస్ శాంతి కుమారి, మంగళవారం సాయంత్రం సచివాలయం లో వివిధ శాఖల అధికా రులతో సమీక్షసమావేశంనిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శు లు, పోలీస్ అధికారులు హాజరైన ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ.. 10న సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది



మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్పైకి చేరుకుంటారని అన్నారు. వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు.ట్యాంక్ బండ్పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళ లు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో వారికి ఏవిధ మైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్లోఉన్న బతుకమ్మ ఘాట్తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను కోరారు.

# రాజేంద్రప్రసాద్‌కు ప్రభాస్ పరామర్శ



సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గుండెపోటుతో ఆయన కుమార్తె గాయత్రి గత శనివారం మృతి చెందింది. అయితే రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆమెకు నివాళులు అర్పించడంతో పాటు రాజేందప్రసాద్‌ను పరామర్శించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవితో పాటు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, వెంకటేశ్ తదితరులు ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే కూతురు పోయిన బాధలో ఉన్న నటకిరిటిని తాజాగా నటుడు రెబల్ స్టార్ ప్రభాస్ పరామర్శించాడు. ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం రాజేందప్రసాద్ కూతురు గాయత్రికి నివాళులు అర్పించాడు. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి గుండెపోటుతో మృతిచెందింది. 38 ఏండ్ల గాయత్రికి గత రాత్రి గుండెపోటు రాగా.. కుటుంబ సభ్యులు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చేర్చారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయారు. కాగా, రాజేంద్ర ప్రసాద్‌కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలానే గాయత్రి కుమార్తె సాయి తేజస్విని బాలనటిగా మహానటి చిత్రంలో నటించారు.

## 'సర్.. ఈ సినిమాలో సుమోలు గాల్లో లేస్తాయా?':

# వి.వి. వినాయక్ బర్త్‌డే స్పెషల్



యాక్షన్‌ను కొత్త తరహాలో చూపించి మాస్ ప్రేక్షకులతో విజిల్స్ వేయించారు. క్లాస్ ఆడియన్స్‌కు కావాల్సింది అందించింది చప్పట్లు కొట్టించారు. మధ్యలో పంథా మార్చినా 'అదుర్స్' అనిపించుకున్నారు. ఆ దర్శకుడెవరో కాదు వి.వి. వినాయక్. నేడు 50వ పుట్టినరోజు జరుపుకొంటున్న ఈ డైరెక్టర్ సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతులివీ..

**కసితో చెన్నైకు..**

వినాయక్ పూర్తి పేరు గండ్రోతు వీర వెంకట వినాయకరావు. సినిమాలపై ఆసక్తితో చెన్నై వెళ్లి కొందరు కో- డైరెక్టర్లను కలిశారు. ఎప్పటి నుంచో పని చేస్తున్న వారంతా దర్శకులుగా ఎదగలేకపోవడంతో.. తనకీ అదే పరిస్థితి వస్తుందేమోనన్న భయంతో వినాయక్ ఇంటికెళ్లిపోయారు. 'ఇక్కడే ఏదైనా పని చూసుకో' అని తల్లి అనడంతో భావోద్వేగానికి గురయ్యారు. మరోవైపు గ్రామస్థుల సూటిపోటి మాటలు. తానేంటో నిరూపించుకునేందుకు మళ్లీ చెన్నై రైలెక్కారు. 'అమ్మ దొంగా!' తదితర చిత్రాల దర్శకుడు సాగర్ వద్ద అస్టిస్టెంటుగా పని చేశారు. తర్వాత, వేరే దర్శకుల వద్ద కో-డైరెక్టర్‌గా చాలా సినిమాలకు వర్క్ చేశారు.

**తొలి సినిమా.. కథ మారింది!**

దర్శకుడిగా 'ఆది'తో తొలి ప్రయత్నంలోనే యాక్షన్‌కు కొత్త అర్థం చెప్పారు. ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కిన ఆ సినిమా టాలీవుడ్‌లో ప్రభంజనం సృష్టించింది. అయితే, ముందుగా అనుకున్న కథ వేరు.. తెరకెక్కింది వేరు. వినాయక్ రాసుకున్న ఫస్ట్ స్టోరీలో బాలకృష్ణ హీరో. ఆ కథలో.. బాలకృష్ణకు ఓ తమ్ముడుంటాడు. అతడిని కాపాడటానికి అన్నయ్య బాంబులు వేస్తాడు. కొన్నాళ్ల తర్వాత ఎస్పైగా తిరిగొచ్చిన అన్నయ్యకు.. తమ్ముడిని అరెస్టు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. తర్వాత ఎన్టీఆర్‌ని కథానాయకుడిగా అనుకోవడంతో కొన్ని మార్పులు చేశారు. బాల నటుడు (హీరో చిన్నప్పటి పాత్ర) బాంబు వేయడం, సుమోలు గాల్లోకి లేవడం వంటి సన్నివేశాలు జోడించారు. విజిల్ వేస్తే సుమోలు బ్లాస్ట్ అయ్యేలా.. హీరోయిజాన్ని కొత్త పంథాలో చూపించి ట్రెండ్ సెట్ చేశారు. 'నంది' అవార్డు అందుకున్నారు. 'దిల్', 'ఠాగూర్'.. ఇలా కెరీర్ ప్రారంభంలో వరుస విజయాల దర్శకుడిగా క్రేజ్ సొంతం చేసుకున్నారు.

**సుమో సన్నివేశాల ప్రభావం..**

గతంలో ఓ సినిమా చిత్రీకరణ సమయంలో వినాయక్ ఎయిర్‌పోర్టుకు వెళ్లగా.. ఆయన్ను గమనించిన ఓ అభిమాని 'సర్.. ఈ సినిమాలో సుమోలు గాల్లో లేస్తాయా?' అని అడిగాడట. ఆయా సీన్స్ ప్రేక్షకులపై ఎంతటి ప్రభావం చూపాయో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో.. మాస్ ఇమేజ్ కోసం ప్రయత్నించే ప్రతి హీరోకి కేరాఫ్ అడ్రస్ వినాయకే. చిరంజీవి, బాలకృష్ణలాంటి అగ్ర కథానాయకుల నుంచి బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అఖిల్‌లాంటి యంగ్ హీరోలతోనూ ఆయన పని చేశారు. అయితే, మహేశ్ బాబుకు తగ్గ కథను రాయలేకపోయానని వినాయక్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. వేరే రచయితలు రాసిన కథలు (కృష్ణ, అదుర్స్ తదితర) తెరకెక్కించడం వల్ల తనలోని కొత్త కోణం బయటపడిందని, వినాయక్ అంటే యాక్షన్ మాత్రమే కాదని ఆ సినిమాలు నిరూపించాయని వినాయక్ అంటుంటారు.

# జనక అయితే గనక

# రిలీజ్ ట్రైలర్ విడుదల



టాలీవుడ్ కుర్ర హీరో సుహాస్ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నాడు. ఈ ఏడాది ఇప్పటికే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్న వదనం, శ్రీరంగ నీతులు, గొర్రె పురాణం అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాలను అందుకున్న ఈ యువ నటుడు ఇప్పుడు మళ్లీ ఒక కొత్త స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. సుహాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'జనక అయితే గనక' సినిమాకు సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తుండగా.. బలగం, లవ్‌మీ వంటి విభిన్న తరహా సినిమాల తర్వాత దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తే.. ఎల్‌కేజీ, యూకేజీలకే లక్షలు వసూలు చేస్తున్న ఈ కాలంలో ఒక మిడిల్ క్లాస్ యువకుడు(సుహాస్) తనకు పిల్లలు పుడితే వారిని ఎలా పెంచాలి, ఎలా చదివించాలి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఈ కాలంలో పిల్లలను పెంచడం కష్టమని పిల్లలు వద్దనుకుంటున్నా సుహాస్‌కు సడన్‌గా తన భార్య గర్భవతి అంటూ షాక్ ఇస్తుంది. అయితే తాను వాడిన కండోమ్ వలనే ఇలా అయ్యిందంటూ నాసిరకం కండోమ్‌లను సప్లయ్ చేస్తున్న కంపెనీపై కేసు పెడతాడు. అయితే ఈ కేసు సుహాస్ జీవితంలో ఎలాంటి మలుపు తీసుకుంది. చివరకు తాను కండోమ్ కంపెనీపై పెట్టిన కేసు గెలిచాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో సుహాస్‌తో పాటు, సంగీత్, వేన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# త్వరలోనే

## బాహుబలి పెళ్లి...!

బాహుబలి ఫ్రాంఛైజీతో గ్లోబల్ స్టార్‌గా మారిన ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్‌టైన్ చేసే పనిలో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ ఎవరంటే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ప్రభాస్ పేరు చెప్పేస్తారు. ఇంతకీ స్టార్ యాక్టర్ ఎప్పుడు పెండ్లి పీటలెక్కబోతున్నాడన్నది మాత్రం ప్రశ్నగానే మిగిలిపోతుంది. త్వరలోనే వెడ్డింగ్ అంటూ నెట్టింట వార్తలు హల్ చల్ చేస్తున్నా.. దీనిపై అధికారికంగా క్లారిటీ రావడం లేదు. అయితే తమ ఫేవరేట్ హీరో ఎప్పుడు ఓ ఇంటివాడు కాబోతున్నాడన్న దానిపై ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి ఇటీవలే విజయవాడలోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. పెండ్లిపై నెలకొన్న ట్విస్ట్‌కు ఫుల్ స్టాప్ పెట్టేసింది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రభాస్ వెడ్డింగ్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే ఉంటుందని చెప్పింది శ్యామలా దేవి. అయితే ఇంతకీ ఎవరా అమ్మాయనేది మాత్రం చెప్పలేదు. ప్రభాస్ ప్రస్తుతం కల్కి 2898 ఏడీ సీక్వెల్, సలార్ 2, రాజా సాబ్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇవే కాకుండా స్పిరిట్, కన్నప్ప, ఫౌజీ చిత్రాలు కూడా ప్రభాస్ ఖాతాలో ఉన్నాయి. మరి ప్రభాస్ నుంచి పెండ్లి ప్రకటన ఎప్పుడుంటుందనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.



# ఫీమేల్ లీడ్ రోల్‌గా సంయుక్త మూవీ

## క్లాప్ కొట్టిన నటుడు దగ్గుబాటి రానా



భీమ్లా నాయక్' సినిమాలో పవన్ కళ్యాణ్, నిత్యా మీనన్ ఒక జంటగా నటిస్తే.. మరో జంటగా రానా దగ్గుబాటి, సంయుక్త నటించారు. ఈ సినిమాలో నిత్యామీనన్ పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అంతే ప్రాముఖ్యత సంయుక్త పాత్రకు కూడా ఉంటుంది. ఆ పాత్రలు వారిద్దరికీ మంచి పేరునే తెచ్చిపెట్టాయి. ఇక ఇప్పటి వరకు హీరోల పక్కన నటిస్తూ సక్సెస్ అందుకుంటున్న సంయుక్త తొలిసారి ఫిమేల్ సెంట్రిక్ యాక్షన్ థ్రిల్లర్‌తో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమె ప్రధాన పాత్రలో నటించబోతున్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమవగా.. ఈ సినిమాకు క్లాప్‌ను 'భీమ్లా నాయక్'లో తనకు భర్తగా నటించిన రానా దగ్గుబాటి కొట్టారు. ఈ సినిమా వరుస బ్లాక్‌బస్టర్స్ సినిమాలతో అలరిస్తున్న టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి సెన్సేషనల్ హిట్ చిత్రాలను అందించిన సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 6గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సంయుక్తనే సమర్పిస్తోంది. బుధవారం రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.

# వార్–2లో విలన్‌గా ఎన్టీఆర్




తారక్ లేటెస్ట్ ఫిల్మ్ 'దేవర' హిట్టవ్వడంతో ఆయన మరింత జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ ఎన్‌టిఆర్31తో పాటు యశ్ రాజ్ ఫిల్మ్స్‌ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ లోని వార్ 2 సినిమాలో పనిచేస్తున్నాడు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీయార్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో తారక్ -హృతిక్ రోషన్‌కు మధ్యలో భారీ యాక్షన్ ప్యాక్‌డ్ సీక్వెన్సెస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన ఓ అప్డేట్ బయటకొచ్చింది.. స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ ఫిల్మ్ షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా మేజర్ పోర్షన్ షూటింగ్ పూర్తయింది. ఎన్టీయార్, హృతిక్ రోషన్ మధ్య జరగనున్న యాక్షన్ ప్యాక్‌డ్ క్లైమాక్స్ ఒక్కటి ఇంకా బాకీ ఉంది. దీంతో వచ్చే ఏడాది నవంబర్‌లో ఈ పార్ట్‌ని చిత్రీకరించడానికి సినీ యూనిట్ సిద్ధమైంది. ప్రత్యేకమైన డైట్‌ని పాటిస్తూ ఇద్దరు హీరోలు కండలు తిరిగిన శరీరాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే వీరిద్దరి మధ్య 'హ్యాండ్ టూ హ్యాండ్' ఫైట్ సీక్వెన్సెస్ కూడా ఉండనున్నాయట. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా తర్వాత గ్లోబల్ స్టార్ అవతారమెత్తిన తారక్‌కి ఇది బాలీవుడ్ డెబ్యూ కావడం విశేషం. అసాధారణమైన యాక్టింగ్, పవర్ ఫుల్ డైలాగ్ డిక్షన్, స్టైలిష్ డ్యాన్సులతో సకలవల్లభుడి గా తెలుగు ప్రేక్షకులకు మాత్రమే పరిమితమైన తారక్ ని బాలీవుడ్ తొలిసారి విట్ నెస్ చేయబోతుంది. డైరెక్టర్ ఆయాన్ ముఖర్జీ ఎన్టీయార్‌ని ఎలా ఉపయోగించుకొన్నాడని సర్వత్రా ఆసక్తి నెలకొంది. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా దర్శక నిర్మాత ఆదిత్యా చోప్రా ఇప్పటికే ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్ సినిమాలని ఇన్‌క్లూడ్ చేశాడు. ఫ్యూచర్‌లో టైగర్ 3, ఆల్ఫా, పఠాన్ 2, టైగర్ వర్సెస్ పఠాన్ చిత్రాలను ప్లాన్ చేస్తున్నాడు